క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చివేత



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మునేరు తువ్వ కాలువ గండ్లు పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. గత నెలలో వచ్చిన వరదలకు తువ్వ కాలువకు 38 చోట్ల పెద్ద, చిన్న గండ్లు పడ్డాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను వెంటనే గండ్లు పరిశీలించటంతో పాటు, పంట నష్టం లేకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. నిధులు మంజూరు కావటంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పనులు వేగంగా చేస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి గండ్లు పూడుస్తున్నారు. ఇప్పటికే 20కి పైగా గండ్లు పూడ్చినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

గోశాలకు రూ.50 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు శుక్రవారం మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన ఉమ్మినేని నరసింహారావు, నాగమణి దంపతుల కుమారుడు పుల్లారావు రూ.50 వేల విరాళం ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడుకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన డీఎండబ్ల్యూ



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ షంషుద్దీన్ బేగం శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 2022 ఫారం–7 తొలగింపులు ఎన్ని తొలగించారు అనే విషయానికి సంబంధించి పలు అంశాలను తనిఖీ చేశారు. వచ్చే శుక్రవారం సీల్డ్ వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు. పేట తహసీల్దార్ సూర్యారావు, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల తహసీల్దార్లు కళ్యాణి, వైకుంఠరావు, నియోజకవర్గ ఎలక్షన్ డీటీ యు.కిషోర్‌బాబు, బీఎల్వోలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి



నందిగామ: పట్టణంలోని విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయాన్ని ఆ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్) కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం నందిగామ డివిజన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినియోగదారులకు సిబ్బంది మెరుగైన సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. స్కానింగ్ కానీ మీటర్లకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు జి.బి. శ్రీనివాసరావు, వి.రమేష్‌బాబు, ఎం.సర్వయ్య, కె.శ్రీనివాసరెడ్డి, దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేపై వర్క్‌షాప్

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేను విజయవంతం చేసేందుకు సిబ్బంది సహకరించాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి కోరారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మూడో విడత భూసర్వేపై డివిజన్లోని రెవెన్యూ, సర్వే సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివాదాలకు తావులేకుండా సర్వే సజావుగా సాగడానికి సిబ్బంది సమష్టి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్ణీత గడువులోపు సర్వే పూర్తిచేయాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన అనంతరం పాస్‌బుక్‌లు జారీచేయాలన్నారు. డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ సారంగపాణి, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు, రెడ్డిగూడెం తహసీల్దార్లు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, చైర్మన్ రాఘవేంద్ర



కౌన్సిల్‌లో చర్చిస్తున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాజకీయాలను పక్కన పెట్టి జగ్గయ్యపేట పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో పయనించేందుకు కృషి చేద్దామని, అందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కోరారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది. ముందుగా కౌన్సిల్ సీసీ తాజుద్దీన్ ఎజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. ముందుగా ప్రతిపక్ష సభ్యులు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, వెంకట్ మాట్లాడుతూ.. ఎజెండాలోని 4వ అంశానికి సంబంధించి పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధికి రూ 2 కోట్లు నిధుల కేటాయింపు, టెండర్ల ప్రక్రియపై పలు విమర్శలు చేశారు. మైనర్ ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణలో ఉన్న చెరువును అభివృద్ధి చేయడం చట్ట వ్యతిరేకమని, దీని వలన 27 ఎకరాల స్థలం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే చెరువు స్థలాలపై మాజీ మున్సిపల్ చైర్మన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, ఫిర్యాదుపై అధికారుల స్పందన వచ్చే వరకైనా టెండర్ ప్రక్రియ ఆపాలని తెలిపారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ అనుమతితో, వారి పర్యవేక్షణలోనే పనులు జరుగుతున్నాయని తెలిపారు. చెరువు విస్తీర్ణం ఎక్కడా తగ్గదని, ఇంకా లోతు తీయడం వలన ఎక్కువ నీరు నిలువ చేయవచ్చని, ఫిర్యాదులు వస్తూనే ఉంటాయని, వాటి కోసం జాప్యం చేస్తూ అభివృద్ధి పనులను ఆపలేమని స్పష్టం చేశారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పాలకవర్గ సభ్యుడు కొలగాని రాము మాట్లాడుతూ చెరువు స్థలాలపై ఫిర్యాదులు చేశారని, రైతులకు పంటకు ఆటంకం కలుగుతుందన్న సాకును చూపి ఆ వంకతో చెరువు అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రతిపక్ష సభ్యులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా చెరువును అభివృద్ధి చేయాలన్న సదుద్దేశంతో విప్ ఉదయభాను ప్రభుత్వం ద్వారా, సమీపంలోని కర్మాగారాల సహకారంతో నిధులు రాబట్టి నిర్మాణం చేపడుతుంటే టీడీపీ వారికి కళ్లు కుడుతున్నాయన్నారు. 2014 నుంచి 2018 మధ్య శ్రీరాం తాతయ్య టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చెరువు మధ్యలో బుద్ధుని విగ్రహం పెట్టారు, అప్పుడు ఎన్ని ఎకరాల స్థలం కోల్పోయిందో, ఏ కౌన్సిల్ తీర్మానం చేశారని నిలదీశారు.

మైలేజ్ కోసం అభివృద్ధిని అడ్డుకోవద్దు

కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పాల్గొన్న విప్ ఉదయభాను మాట్లాడుతూ.. ప్రతిపక్షం అంటే అధికార పక్షం వారు చేసే అభివృద్ధి పనులను అడ్డుకోవడం కాదన్నారు. ప్రతిపక్ష పార్టీగా ఉన్నందున తమ మైలేజి పెంచుకునేందుకు ప్రయత్నించవద్దని, తద్వారా అభివృద్ధి పథంలో ముందుకు పోవాల్సిన వ్యవస్థలు అన్నీ స్తంభించిపోతాయని, దానికి అందరూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు.

డిసెంబర్ నాటికి టిడ్కో ఇళ్లు ప్రారంభిస్తాం..

బలుసుపాడు రోడ్డులో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు శుక్రవారం రోజు నుంచి ప్రారంభిస్తున్నామని, డిసెంబర్ నాటికి ప్రారంభిస్తామని విప్ ఉదయభాను తెలిపారు. టీడీపీ పాలనలో టిడ్కో గృహాలకు స్థలాలు ఇచ్చిన యజమానులకు, కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వంలో ఇవ్వాల్సి వచ్చిందన్నారు. జగ్గయ్యపేట పట్టణం అభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నేషనల్ హైవేపై కోటి రూపాయలతో బస్టాండ్ నిర్మిస్తున్నామని, రూ.2.5 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, రూ.3 కోట్లతో ప్రభుత్వాస్పత్రి ఆధునికీకరణ, రూ.14 కోట్లతో చిల్లకల్లు 4 లేన్ రోడ్డు, ఒక్కొక్కటి రూ.90 లక్షల చొప్పున రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, జగనన్న కాలనీ, చిల్లకల్లు వద్ద రూ 2 కోట్లతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. అలాగే పట్టణ ప్రజల దశాబ్దాల కల అయిన ప్యాసింజర్ రైలు కోసం తాను ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన 10 రోజుల్లోనే స్పందన రావడం సంతోషదాయకమన్నారు. గీతారాణి, గింజుపల్లి వెంకట్రావు తదితర పలువురు కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించగా, ఎజెండాలోని 6 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కమిషనర్ మల్లేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన నిధులు మంజూరుచేసి అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక పాత శివాలయం వీధిలో ఇటీవల పూర్తిచేసిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టి 90 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. పట్టణంలోని పాత శివాలయం వీధిలో రూ.23.40 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు పూర్తి చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయకపోవటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, బండారుపల్లి నాగపుష్పలీల, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదుగుల శంకరరావు, వార్డు ఇన్‌చార్జి దేవరకొండ గురవయ్య, నాయకులు నారిశెట్టి శ్రీనివాసరావు, కోయా సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి బాలయ్య ఉప్పు స్వామి, మార్త శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.బాలశంకరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



రామాలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఈ దుర్గేష్ తదితరులు

మక్కపేట(వత్సవాయి): దేవదాయ శాఖ నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించి ఆలయాన్ని నిర్మాణం చేయాలని ఆ శాఖ ఈఈ దుర్గేష్ తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కోసం దేవదాయశాఖ రూ.50 లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. నిర్దేశించిన లక్ష్యం లోపు ఆలయాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తిగా నాణ్యతను పాటించాలని, పనుల్లో ఎటువంటి ఆరోపణలు వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. వచ్చే మహాశివ రాత్రి నాటికి ఆలయ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ రాజు, ఏఈ నాగేంద్ర కుమార్, స్థపతి సతీష్, ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు కనగాల రమేష్, అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ, కేవైఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద రామాలయం పునర్నిర్మాణ పనుల పరిశీలన

జగ్గయ్యపేట: పట్టణంలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయ(పెద్ద రామాలయం) పునర్నిర్మాణ పనులను దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.25 కోట్లతో ఆలయ పనులు జరుగుతున్నాయన్నారు. పనుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంజినీరింగ్ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా తపతి సూచనల మేరకు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం 25 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ రాజు, ఏఈ కుమార్, తపతి సతీష్, ఆలయ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- జగ్గయ్యపేట పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న విప్ ఉదయభాను, నాయకులు

జగ్గయ్యపేట: రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమ పథకాల అమలులో నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని ఏడవ సచివాలయం పరిధిలోని 15, 18 వార్డుల్లో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలులో వివక్షత ఉండేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వివక్షతకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నామన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నిత్యం ప్రభుత్వ సంక్షేమ పథకాలను విమర్శిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా అనుకూల మీడియాతో దుర్మార్గ రాతలు రాయిస్తూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. ప్రజలంతా గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ విజయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వరదరాజ స్వామి వారి ఆలయం అధ్వాన్నంగా ఉండటంపై ఆలయ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా కన్వీనర్ రాజ్యలక్ష్మి, సచివాలయ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, ఎస్సీ సెల్ నాయకుడు బద్దు నాయక్, నాయకులు ఫిరోజ్ ఖాన్, పెంటి శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేను పూర్తి చేయాలి



కంచికచర్ల: ఓటర్ల సర్వేను బీఎల్వోలు సకాలంలో పూర్తి చేయాలని నందిగామ ఆర్డీవో ఏ.రవీంద్రరావు ఆదేశించారు. కంచికచర్లలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు చేసుకునేందుకు వెసులుబాటు ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలని చెప్పారు. ఎటువంటి అవకతవకలు లేని ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సహకారాన్ని తీసుకుని జాబితాను తయారు చేయాలన్నారు. స్థానిక పోలింగ్ స్టేషన్ నెంబర్ 197, 204 నందు జరుగుతున్న ఓటర్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ పి.శంకరబాబు, డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, బీఎల్వోలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు..
- ఎంపీ నిధులతో 17 వాటర్ ట్యాంకర్ల అందజేత



వాటర్ ట్యాంకర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: తాగునీటి ఎద్దడి నివారణతో పాటు ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని నిధులతో అందజేసిన వాటర్ ట్యాంకర్‌లను స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాజకీయాలు ముఖ్యం కాదని ప్రజలకు మంచి చేయటమే తమ లక్ష్యమని మంచి చేసే విషయంలో ఎవరితోనైనా కలిసి పని చేస్తామన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని రూ.42.50 లక్షల వ్యయంతో నియోజకవర్గానికి 17 వాటర్ ట్యాంకర్‌లను అందజేశారన్నారు. వీటిలో చందర్లపాడు మండలానికి 8, కంచికచర్ల మండలానికి 2, నందిగామ, వీరులపాడు మండలాలకు మూడేసి ట్యాంకర్లను అందించారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..

మంచి నీటి పైప్‌లైన్‌లు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం పుష్కలంగా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ పనులు జరుగుతున్నాయన్నారు. పనులను సకాలంలో పూర్తి చేసి ఇంటింటికీ రక్షిత తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. వేసవిలో సైతం నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆయన గుర్తు చేశారు.

ఎంపీకి కృతజ్ఞతలు..

నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ నాని పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారని జగన్‌మోహనరావు తెలిపారు. ప్రజలకు మంచి చేసే నాయకులు వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని గుర్తు చేశారు. పార్టీలు ఏవైనా ప్రభుత్వంలో భాగంగా ప్రజలకు సేవ చేయటం తమ బాధ్యతని చెప్పారు. అడగ్గానే నిధులు మంజూరు చేస్తున్న ఎంపీ నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, మలక్ బషీర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల రంగ, నాయకులు పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రవికిరణ్ రెడ్డి, చింతోటి ప్రసాద్, షేక్ ఖాలిక్, విశ్వనాథపల్లి కృపారావు, నాదెండ్ల నరేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ

- మొదటి శుక్రవారం కావడంతో భక్తిశ్రద్ధలతో పూజలు
- ఉదయం నుంచే కొనసాగిన భక్తుల రద్దీ



నందిగామ వాసవీ అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

కంచికచర్ల: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శ్రావణ శోభ నెలకొంది. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కంచికచర్ల పాత శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కాకాని పవన్‌కుమార్, సుమన్‌శర్మ, ఆలయ ధర్మకర్త వెంకటరమణలు ఎమ్మెల్యేకు శేష వస్త్రాల అందించి, విశేష పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, రైతులు సాగుచేసిన వ్యవసాయం, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఆ మహాదేవుడు శివుడు ప్రజలను ఎల్లవేళలా ఆశీర్వదించాలని కోరుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, బండారుపల్లి నాగపుష్పలీల, ఉప సర్పంచ్ వేమా సురేష్‌బాబు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, కోయా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో పూజలు

నందిగామ: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. పట్టణంలోని మరిడి మహాలక్ష్మమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సుక శ్యామలాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీపురంలో వేం చేసి ఉన్న వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి గట్టుపై వేం చేసి ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆయా పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు జరిపించుకున్నారు. పలు ఆలయాల వద్ద సాయంత్రం మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పూలు అందజేశారు.



కంచికచర్లలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

జగ్గయ్యపేటలో పూజలు..

జగ్గయ్యపేటఅర్బన్: శ్రావణ మాస మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక అద్దాల బజారులో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నకాశి బజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారికి 10 వేల నిమ్మకాయలతో విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి రజత కవచాలంకరణ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉన్న నాగసత్యమ్మ ఆలయంలో అమ్మవారికి గాజులతో అలంకరణ చేశారు. వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేట్ ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తిరుపతమ్మ సన్నిధిలో..

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వేకువ జాము నుండే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.



బోనాలతో దర్శనానికి వస్తున్న భక్తులు



నకాశిబజారులో ఆలయానికి నిమ్మకాయలతో అలంకరణ

నేడు సర్పంచ్, వార్డు సభ్యులకు ఉప ఎన్నిక

వీరులపాడు: మండలంలోని దాచవరం గ్రామ సర్పంచ్, జమ్మవరం వార్డు ఉప ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. సర్పంచ్ ఉప ఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండగా వార్డు ఎన్నికకు ఇద్దరు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారి ఝాన్సీరాణి తెలిపారు.

దాచవరం సర్పంచ్ ఉప ఎన్నికకు 696 మంది ఓటర్లు, జమ్మవరం వార్డు ఎన్నికకు 143 మంది ఓటర్లు ఉన్నారు. రెండు గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. అనంతరం రెండు గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ సాగుతుందని సాయంత్రానికి ఫలితాలను వెల్లడించటం జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

రెండు గ్రామాల్లో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా విజయవాడ డీసీపీ అజిత వేజెండ్ల రెండు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని గుంపులుగా ఉండవద్దని ప్రజలను కోరారు. ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్పంచ్ ఎన్నికకు సర్వం సిద్ధం

పెద్దమోదుగపల్లి(వత్సవాయి): గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికకు సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో సీహెచ్ చెన్నారావు, ఎన్నికల అధికారి డి.బాబురావు తెలిపారు. మొత్తం 865 ఓట్లు ఉండగా వాటిలో మహిళలు 471, పురుషులు 394 మంది ఉన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో 8 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తును ఎస్ఐ బి.అభిమన్యు ఏర్పాటు చేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నందిగామ: పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలో ఆరు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 27వ తేదీలోపు గ్రామ, వార్డు సచివాలయ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.